
హిమాయత్‌నగర్ రోడ్డులో భారీగా నిలిచిన వరద నీరు

నగరంలో కుమ్మరించిన వర్షం

# గంట వానకే.. అతలాకుతలం

### బంజారాహిల్స్‌లో 8.3 సెంటీమీటర్లు

బంజారాహిల్స్ రోడ్ నెం.3లో అత్యధికంగా 8.3 సెంటీమీటర్లు, రోడ్ నెం.12లో 8సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఫిలింనగర్‌లో 6.5 సెంటీమీటర్లు, శ్రీనగర్ కాలనీలో 6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బంజారాహిల్స్ రోడ్ నెం 11లోని ఉదయ్‌నగర్‌లో వరదనీటి నాలా పైకప్పు వరదనీటి దాటికి కుప్పకూలింది. ఎగువ ప్రాంతంనుంచి భారీగా వచ్చిన వరదనీటితో బస్తీలోని పలు ద్విచక్రవాహనాలు నాలాలో కొట్టుకుపోయాయి. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్, బండారు బాల్‌రెడ్డినగర్ బస్తీల్లో భారీగా వరదనీరు పోటెత్తింది. ఇండ్లలోకి వరదనీరు, బురద చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. భారీ వర్షానికి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఇందిరానగర్, కమలాపురి కాలనీ, పంజాగుట్ట, ఖైరతాబాద్, సోమాజిగూడ, రాజ్‌భవన్ రోడ్ తదితర ప్రాంతాలలో భారీగా వరదనీరు నిలవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జీహెచ్‌ఎంసీ మాన్‌సూన్ బృందాలు పత్తా లేకపోవడంతో పలు ప్రాంతాల్లో రాత్రి వరకు వర్షపునీరు రోడ్లపై నిలిచిపోయింది.


జూబ్లీహిల్స్‌లో వరదనీటిని క్రమబద్ధీకరిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

## ఉప్పొంగిన నాలాలు.. చెరువులను తలపించిన రోడ్లు

నీటమునిగిన కాలనీలు.. ఇండ్లలోకి చేరిన వరదనీరు

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న వాహనదారులు, కాలనీల వాసులు

అత్యధికంగా బంజారాహిల్స్‌లో 8.3 సెంటీమీటర్లు

ఉదయ్‌నగర్‌లో వరదనీటిలో కొట్టుకుపోయిన వాహనాలు


ఫిలింనగర్‌లోని బండారు బాల్‌రెడ్డినగర్ బస్తీలో వరదనీటి కారణంగా కొట్టుకు పోయిన రోడ్డు


హిమాయత్‌నగర్‌లో రోడ్డుకు అడ్డుగా కూలిన చెట్టు

బంజారాహిల్స్/ హిమాయత్‌నగర్ /జూబ్లీహిల్స్/బండ్లగూడ /మైలార్‌దేవ్‌పల్లి, మే 16 : గంటన్నర సేపు కురిసిన భారీ వర్షానికి ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్ పరిసరాలు అతలాకుతలంగా మారాయి. రహదారులన్నీ నదులను తలపించాయి. డ్రైనేజీలు, మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లాయి. నాలాలు ఒప్పొంగాయి. రహదారులపై భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆఫీస్‌ల నుంచి ఇంటికి బయలుదేరే సమయానికి కుండపోత వర్షం కురవడంతో వాహనదారుల తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలు కాలనీలలో వర్షపునీటితో జనజీవనం స్తంభించిపోయింది. జీహెచ్‌ఎంసీ అధికారులు తక్షణమే స్పందించి మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్‌తో పాటు డీఆర్‌ఎఫ్ సిబ్బందిని తరలించి సహాయక చర్యలు చేపట్టారు. మ్యాన్ హోళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి నీటిని క్రమబద్ధీకరించారు.

### హిమాయత్‌నగర్‌లో..

హిమాయత్‌నగర్, హైదర్‌గూడ, కింగ్‌కోఠి, లిబర్టీ తదితర లోతట్టు ప్రాంతాల్లో రోడ్లు చెరువులను తలపించాయి. హిమాయత్ నగర్ వీధి నెం14లో భారీ వృక్షం కూలిపోయింది. కాంగ్రెస్ నేత సర్ఫరాజ్ సంఘటన స్థలానికి చేరుకుని జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించగా సిబ్బంది వచ్చి రోడ్డుకు అడ్డుగా పడిన చెట్టును తొలగింపజేశారు.

> యూసుఫ్‌గూడ సర్కిల్‌లో వరదనీరు నిలువకుండా 24గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు వరదనీరు సాఫీగా వెళ్లేగా చూడాలని ఈఈ రాజ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ ఈఈలు రామచంద్రరాజు, శ్రీరాములు, ఏఈఈలు అవినాశ్, భరత్, న్యాక్ ఏఈ వెంకటేశ్‌ల బృందం ముంపు ప్రాంతాలలో పర్యటిస్తూ సహాయక చర్యలను పర్యవేక్షించారు.

### రాజేంద్రనగర్‌లో జలమయమైన లోతట్టు ప్రాంతాలు


రాజేంద్రనగర్‌లో పిల్లర్ నంబర్ 191వద్ద వర్షం నీటిని పరిశీలిస్తున్న డీసీ రవికుమార్

గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. డీసీ రవికుమార్ అదేశాలతో మాన్‌సూన్ బృందాలు రంగంలోకి దిగి ప్రజలకు, వాహన దారులకు ఇబ్బందులు కలుగకుండా రోడ్లపై నిలిచిన నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, రాజేంద్రనగర్, శివరాంపల్లి, హైదర్‌గూడ, పాండురంగానగర్, నందిముస్లాయిగూడ, భరత్‌నగర్, మైలార్‌దేవ్‌పల్లి, దుర్గానగర్, బాబుల్‌రెడ్డినగర్, కాటేదాన్ తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నంబర్ 191 వద్ద ఎప్పటిలాగానే నీరు నిల్వ ఉండటంతో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది.

### నిమ్స్ ఈఎండీ వద్ద కూలిన చెట్టు

ఖైరతాబాద్, మే 16 : భారీ వర్షానికి పలు చోట్ల చెట్లు కూలాయి. కొమ్మలు విరిగిపడ్డాయి. పంజాగుట్ట మోడల్ హౌజ్ వద్ద ఓ భారీ వృక్షం నేరకూలగా, నిమ్స్ దవాఖానలోని ఎమర్జెన్సీ వార్డు వద్ద ఓ చెట్టు కూలిపోయింది. నిమ్స్ అధికారులు అప్రమత్తమై వెంటనే ఆ చెట్టును తొలగించారు.


నిమ్స్ ఆవరణలోని మోడల్ హౌజ్ వద్ద కూలిన చెట్టు

### ఉదయ్‌నగర్‌లో మేయర్ పర్యటన..

నాలా పైకప్పు కూలిన విషయాన్ని తెలుసుకున్న జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఉదయ్‌నగర్ కాలనీలో పర్యటించారు. జీహెచ్‌ఎంసీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలను అప్రమత్తం చేసి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఎక్కడా ప్రాణనష్టం లేకుండా చూసుకోవాలని, నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.



## ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు స్కాలర్‌షిప్ టెస్ట్

హిమాయత్‌నగర్, మే 16 : ఫ్యాషన్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఫ్యాషన్ డిజైనింగ్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్(నిఫ్ట్) డైరెక్టర్ కె.రాము గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులలో చేరేందుకు ఈనెల 19న కొత్తపేటలోని తమ ఇనిస్టిట్యూట్‌లో ఉచితంగా స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫ్యాషన్ గార్మెంట్ మేకింగ్, డిజైనింగ్, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్, ప్యాట్రన్ మేకింగ్, కటింగ్ తదితర విభాగాల్లో 3 నెలలు, 6 నెలలు, ఒక ఏడాది డిప్లొమా కోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల యువతి, మహిళలు ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసు కోవాలన్నారు. వివరాల కోసం 9030610033/ 55 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## అడ్డుగా ఉన్న వాహనం తీయమన్నందుకు దాడి

శంషాబాద్ రూరల్, మే 16 : తన వాహనానికి అడ్డుగా పెట్టిన ద్విచక్ర వాహనం తీయమంటే దాడిచేసి గాయపర్చారని ఓ వ్యక్తి శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ పట్టణంలోని రుద్రకాలనీకి చెందిన సురేశ్ బుధవారం రాత్రి శంషాబాద్ పట్టణంలో ఎయిర్‌పోర్టు బావర్చి హోటల్ ఎదురుగా ఫ్లైఓవర్ కింద తన ద్విచక్ర వాహనం పార్కింగ్ చేశాడు. తిరిగి తన స్నేహితుడు సాయితో కలిసి వెళ్లి వాహనం తీసుకునే క్రమంలో అడ్డుగా ఉన్న వాహనాన్ని తీయాలని కోరాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ముగ్గురు వ్యక్తులు సురేశ్, సాయిపై దాడి చేసి గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శంషాబాద్ పట్టణంలోని హైమ్మద్‌నగర్ కాలనీకి చెందిన తౌసిఫ్, ఉమ్మర్, మిర్జా హైమ్మద్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం.. కాఫీషాపుపై కేసు

బంజారాహిల్స్, మే 16 : రోడ్డుమీద ట్రాఫిక్‌కు అడ్డంకులు కలిగిస్తూ వాహనాలు పార్కింగ్ చేయిస్తున్న కాఫీ షాపు నిర్వాహకులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్ నెం 45లోని ట్రూ బ్లాక్ కాఫీ పేరుతో నడుస్తున్న కాఫీ షాపు వద్ద వాహనాలు ఇష్టారాజ్యంగా పార్క్ చేస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రద్దీ సమయాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉన్నట్లు గుర్తించిన జూబ్లీహిల్స్ ట్రాఫిక్ కానిస్టేబుల్ దిలీప్ గురువారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు 'ట్రూ బ్లాక్ కాఫీ' నిర్వాహకులపై ఐపీసీ 341,290తో పాటు సీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఉచిత చేప పిల్లల పంపిణీ కొనసాగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్ ముదిరాజ్

ఖైరతాబాద్, మే 16 : ముదిరాజ్‌లకు మంత్రి పదవి కేటాయిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడం హర్షణీయమని తెలంగాణ ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర కన్వీనర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాలని, మత్స్య సహకార సొసైటీలకు నేరుగా డబ్బులు పంపిణీ చేసి, పెట్టుబడి సాయం అందించాలన్నారు. మృగశిరకార్తె రోజు హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో ఫిష్ ఫెస్టివల్‌ను నిర్వహించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చడంతో పాటు నామినేటెడ్ పదవులు ఇస్తామన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ముదిరాజ్ మహా సంఘం రాష్ట్ర నాయకులు బొక్క శ్రీనివాస్, ఉప్పరవేణి రంజిత్, సుంకర మహేశ్, మన్నె వెంకటేశ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## ఛత్తీస్‌ఘడ్‌లోని సాయుధ మిలటరీ క్యాంప్‌లను ఎత్తివేయాలి


హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నేత

హిమాయత్‌నగర్, మే 16 : ఛత్తీస్‌ఘడ్‌లో ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ ఈ నెల 18న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు తెలిపారు. సభకు సంబంధించిన కరపత్రాలను గురువారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీడిత ప్రజలకు చెందిన సహజ సంపదను కార్పొరేట్ శక్తులు, పెట్టు బడిదారులకు లబ్ధి చేకూర్చేందుకు ఆదివాసులను హతం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. 18న జరిగే సభకు ప్రొఫెసర్ హరగోపాల్, పలు సంఘాల నాయకులు సోనిసోరి, కాత్యాయిని, అనురాధతో పాటు పలు రాజకీయ పార్టీల నేతలు, ప్రజాస్వామిక వాదులు హాజరవుతున్నాట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు జాన్, శ్యామలరావు, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్‌నగర్‌కాలనీని ముంచారు

నీటిని తోడేందుకు మోటార్లు ఏర్పాటు

కరెంటు సరఫరా తొలగింపు

వర్షం వస్తే.. తప్పని ముంపు సమస్య

ఫిర్యాదులందినా.. పట్టింపు శూన్యం


మునిగిపోయిన బాక్స్ డ్రేయిన్, కాలనీలో నిలిచిన వరద నీరు

ఖైరతాబాద్, మే 16 : జీహెచ్‌ఎంసీ సిబ్బంది నిర్లక్ష్యం ఆ కాలనీకి శాపంగా మారింది. గ్రేటర్‌లో గంటన్నర పాటు కురిసిన భారీ వర్షానికి ఖైరతాబాద్ డివిజన్‌లోని రాజ్‌నగర్‌కాలనీ వాసుల వెతలు వర్ణణాతీతం. కాలనీకి ఆనుకొని ఉన్న అతిపెద్ద నాలాకు తోడు, రోడ్లపై నిలిచిన నీరు పోయే దారి లేక జలమయమయ్యాయి. నీటిని ఎత్తిపోసేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన మూడు మోటార్లకు కరెంటు సరఫరా నిలిచిపోవడంతో వర్షాలు కురిసినప్పుడల్లా కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుపోతున్నది. అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు వాపోతున్నారు.

### వ్యర్థాలతో మునిగిన బాక్స్ డ్రేయిన్

నాలా పరివాహక ప్రాంతం కావడంతో ఇక్కడ ఎప్పుడూ వరద ముంపు ప్రమాదం పొంచి ఉంటుంది. ఆ సమస్యను కొంత నివారించేందుకు గత సంవత్సరం సుమారు రూ.10లక్షల వ్యయంతో మూడు మోటార్లను ఏర్పాటు చేశారు. వరద నీరు నిండినప్పుడల్లా ఆ మోటార్ల సాయంతో తోడేసే వారు. అయితే కొంత కాలంగా మోటార్లు పనిచేయడం లేదు. ఆ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఈ సమస్య ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. మోటార్లకు పవర్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ జంక్షన్ బాక్సును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## ఎఫ్‌ఎన్‌సీసీలో పికిల్ బాల్ కోర్టు ప్రారంభం

బంజారాహిల్స్, మే 16 : జూబ్లీహిల్స్‌లోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో వి.సూరన్న (సినీ ఆర్ట్ డైరెక్టర్) మెమోరియల్ పికిల్ బాల్ కోర్టును గురువారం సినీ దర్శకులు పి.సాంబశివరావు, ఎఫ్‌ఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కేఎల్ నారాయణ, ఆనంద్ సినీ సర్వీస్ నిర్వాహకులు పి.కిరణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు జి.ఆదిశేషగిరి రావు, ఉపాధ్యక్షులు టి.రంగారావు, కార్యదర్శి ముళ్లపూడి మోహన్, కోశాధికారి రాజశేఖర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పెద్దిరాజు, కమిటీ సభ్యులు కాజా సూర్యనారాయణ, శైలజా జూజుల, ఎ.గోపాల్ రావు, ఏడిద సతీశ్, సామ ఇంద్రపాల్ రెడ్డి, వి.నిరంజన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.


పికిల్ బాల్ కోర్టును ప్రారంభిస్తున్న సినీ దర్శకుడు సాంబశివరావు

## గంధంగూడలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

బండ్లగూడ, మే 16 : ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గండిపేట మండల తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రెవెన్యూ సిబ్బంది గండిపేట మండల పరిధిలోని గంధంగూడ, హిమాయత్ సాగర్‌లో మూడు అక్రమ నిర్మాణాలు, నాలుగు నీటి సంపులను తొలగించారు.



## బండ్లగూడలో.. వేంకటేశ్వర కల్యాణం

బండ్లగూడ, మే 16 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జ్ఞాన వేంకటేశ్వర స్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా గురువారం వేంకటేశ్వర కల్యాణ మహోత్సం ఘనంగా జరిగింది. కల్యాణ వేడుకలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## పారిశుధ్య నిర్వహణపై డీసీ సమీక్ష

మైలార్‌దేవ్‌పల్లి, మే 16 : పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉన్నదని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అమ్మా గార్డెన్‌లో గురువారం అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపైకి చెత్త రాకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చెత్త సేకరణ కార్మికులు ప్రతి రోజు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని సూచించారు. స్థానికంగా నాయకులను, ప్రజలను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. యూసీడీ వింగ్ డిప్యూటీ ఎస్‌బీఎం శ్రీనివాస్, డీపీవో రాధారాణి, సాట్ ఆటో డ్రైవర్లు, ఎస్‌ఎఫ్‌ఏలు, ఆర్‌పీలు, ఎస్ఎస్‌లు, డీపీవో, డిప్యూటీ ఎస్‌డబ్ల్యుఎం, తదితరులు పాల్గొన్నారు.

